క్లుప్తంగా

విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ



విద్యార్థిని గణేశ్వరికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న దాత పోకల ఫణిప్రకాశరావు

బిక్కవోలు: పదోతరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన కొంకుదురు ఉన్నత పాఠశాల విద్యార్థిని కురందాసు గణేశ్వరికి కాకినాడకు చెందిన ప్రవాస భారతీయుడు పోకల ఫణిప్రకాశరావు రూ.50 వేల విలువ గల ల్యాప్‌టాప్ బహూకరించారు. ఈ సందర్భంగా దాత ఫణిప్రకాశరావు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్నారు. గణేశ్వరి మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

కంప్యూటర్ ల్యాబొరేటరీ ప్రారంభం



సీతానగరంలో షంషాద్ బేగంను సత్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబొరేటరీని దాత మాతృమూర్తి షంషాద్ బేగం శనివారం ప్రారంభించారు. అమెరికాలో స్థిరపడిన చినకొండేపూడికి చెందిన పూర్వ విద్యార్థి మహ్మద్ ఆసిఫ్ తన తాత మహ్మద్ షంసుద్దీన్ బాషీ జ్ఞాపకార్థం అందించిన ఆర్థిక సహాయంతో కళాశాలలో కంప్యూటర్ ల్యాబొరేటరీని ఏర్పాటు చేశారు. దీనిని బేగం ప్రారంభించారు. అనంతరం ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు, అధ్యాపకులు సత్కరించారు. కళాశాల అధ్యాపకులు వీవీ సుబ్బారావు, డాక్టర్ శర్మ, ఎస్.శివాజీ, దాత కుటుంబ సభ్యులు, ఫ్రాంక్లిన్ టెక్ సిస్టం సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో ప్రతిభ చాటిన పదో తరగతి విద్యార్థులకు సత్కారం

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎం.పుష్పలత ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. హైస్కూల్ స్థాయిలో పదో తరగతిలో మొదటి, మూడు స్థానాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో పాటు వారి తల్లులకు సన్మానించారు. సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, పీఎస్‌సీ చైర్మన్ బండారు సూర్యకుమారి హాజరై విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. యశ్విని, హారిక, నాగదేవిలకు బహుమతులు, సర్టిఫికెట్‌లు, మెమెంటోలు, నగదు పారితోషికం అందించారు. ఉపాధ్యాయులు కన్నూరి సతీష్‌బాబు, రాజేష్, సరళ, రాజేశ్వరి, విశాలాక్ష్మి, శంకరరావు, బ్రహ్మజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ప్రభుత్వాసుపత్రిలో రోగులను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వివిధ అనారోగ్య సమస్యలతో ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత నిచ్చారన్నారు. ప్రజారోగ్యమే పరమావధిగా సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణల ఫలితంగా వైద్య రంగం కొత్తరూపు సంతరించుకుందని చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయన్నారు. అనంతరం ఆసుపత్రిలో వార్డులను సందర్శించిన ఎమ్మెల్యే రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ స్వయంగా పరీక్షించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ ఏడుకొండలు, పార్టీ నాయకులు చింతా శ్రీనివాసరెడ్డి, సత్తి సూరారెడ్డి, అభివృద్ధి సొసైటీ సభ్యులు ఎల్‌ఐసీ బాల, బి.ఉమాశంకర్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి కంప్యూటర్స్ అందజేత

అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రికి గ్రామానికి చెందిన వ్యాపారవేత్తలు నల్లమిల్లి రామచంద్రారెడ్డి, తాడి తమ్మిరెడ్డి ఒక్కోటి రూ.60 వేల విలువైన రెండు కంప్యూటర్లు, ప్రింటర్లు ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా బహూకరించారు. సందర్భంగా దాతలను ఎమ్మెల్యే సత్కరించారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తాగునీటిని సరఫరా చేసే రెండు ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ రూ.18 లక్షల ఎంపీ నిధులతో రెండు ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్లను నియోజకవర్గానికి అందించారని చెప్పారు. అనపర్తి, రంగంపేట మండలాల్లో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఈ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీలు బండారు శ్రీనివాసరావు, ఏడుకొండలు, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శి పడాల శ్రీనివాసరెడ్డి, మల్లిడి నితిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

విజ్ఞానదాయకంగా సదస్సు



సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లడానికి, పరిపుష్టికి, అందుకు కారకులైన మూలు స్తంభాల వంటి మహనీయుల గురించి సమాచారంతో పాటు ప్రముఖుల సలహాలు, సూచనలు తెలుసుకునే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ముంబయిలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే నేషనల్ లెజిస్లేచర్స్ కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. దేశంలో స్వాతంత్ర అమృతోత్సవాలు జరుపుకొంటున్న తరుణంలో ముంబయిలో జియో వరల్డ్ కాన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా సుమారు రెండు వేల మంది శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు హాజరయ్యారన్నారు. ఇందులో మొదటి రెండు రోజుల అనుభూతిని వ్యక్తపరుస్తూ రాజమహేంద్రవరంలో కార్యాలయం నుంచి ఎమ్మెల్యే శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తొలిరోజు సదస్సుకు హాజరైన పలువురు ప్రముఖులు 'బెల్ ఆఫ్ డెమొక్రసీ'ని మోగించడం ద్వారా కార్యక్రమం ప్రారంభమైందన్నారు. చట్టసభల నిర్వహణ, శాసన సంస్థల బలోపేతం తదితర అంశాలపై యువ శాసనసభ్యులు అనుసరించాల్సిన మార్గాలను సీనియర్ పార్లమెంటేరియన్ల ప్రసంగాల ద్వారా తెలుసుకోగలుగుతున్నామని ఎమ్మెల్యే రాజా అన్నారు. ప్రజాస్వామ్యం పటిష్టత, చట్టసభల సభ్యుల సాధికారత, వివిధ రాష్ట్రాల సభ్యుల కలయిక లక్ష్యంగా ఎంఐటీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్, భారతీయ ఛాత్ర సంసద్ సంయుక్త భాగస్వామ్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.

మహోన్నతుడు జక్కంపూడి



నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: దివంగత నేత, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు మహోన్నతుడని సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, నాయకులు చింతలపూడి వీరబాబు, వలవల వల్లీ, బాబు నాగేశ్వరరావు, మట్ట మునియ్య, కాతా శ్రీనువాసు అన్నారు. శనివారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడారు. ఇనుగంటివారిపేటలో జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. ఆయన తనయుడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేని వారు ఈ పనిచేశారన్నారు. నిందితులను గుర్తించి పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చారిత్రాత్మకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

అనపర్తి: కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో మండల పరిధిలోని పారా మెడికల్ సిబ్బంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం కాంట్రాక్ట్ ఉద్యోగులు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా అభద్రతా భావంతో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటన చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య



గోకవరంలో విద్యార్థులకు పురస్కారాలు అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుండటంతో కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో సైతం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, విద్యాకమిటీ చైర్మన్ కణితి శ్రీనివాస్, తోలేటి ప్రసాద్, హెచ్‌ఎం పల్లాల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించేందుకే జగనన్న సురక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మజ్యోతి

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందుకే జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టినట్టు ఎంపీడీఓ పద్మజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తెలిపారు. గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్ష పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి జూలై 23 వరకూ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు పొందడంలో తలెత్తే సమస్యలను పరిష్కరించి అర్హులకు పథకాలు అందేలా చూస్తారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తోలేటి రాంప్రసాద్, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక

రంగంపేట: డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో నాలుగో తరగతిలో ప్రవేశాలకు విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీరామరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మండల స్థాయి ఎంపికలు జరుగుతాయని చెప్పారు. 2014 ఆగస్టు 1వ తేదీ నుంచి 2015 జూలై 31 తేదీల మధ్యలో పుట్టినవారు అర్హులన్నారు. ఎంపికకు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ ధ్రువపత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

బిక్కవోలులో..

బిక్కవోలు: డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో నాలుగో తరగతిలో ప్రవేశాలకు విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ జె.ర్యూనీస్ శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద మండల స్థాయి ఎంపికలు జరుగుతాయని చెప్పారు.

త్రిముఖలింగేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో త్రిముఖలింగేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడి వద్ద కొలువైన బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరస్వామికి శనివారం మాసశివరాత్రి పురస్కరించుకుని అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్లు, ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ పడాల వీర వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం



గుమ్ములూరులో బహుమతులు పొందిన విద్యార్థులు

మధురపూడి: ప్రభుత్వం విద్యార్థుల ప్రతిభను గుర్తించి పురస్కారాలు అందించడం అభినందనీయమని ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు అన్నారు. గుమ్ములూరు హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు పేరిట ముగ్గురు విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. హెచ్‌ఎం గంగాభవానీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. అలాగే మండలంలోని 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: మండలంలోని సంపర గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామికి అర్చకులు కండివిల్లు హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో శనివారం కుంకుమ పూజలు, తులసీ పూజలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.